జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 2 | సెప్టెంబర్ | 2026 • పేజీలు : 9



# శిరీష కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం: మంత్రి సీతక్క



8 లో..

భద్రాచలం ఏజెన్సీ రాజకీయాల్లో ఎన్నడూ లేని విధంగా ఒక పెద్ద ఆర్థిక కుంభకోణం కలకలం రేపుతోంది. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాజీ పీఏ కోర్ల కళ్యాణ్ కుమార్ చేసిన లీలలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుంటే.. ఈ దందా పరిమాణం చూసి మన్యం వాసులు ముక్కున వేలేసుకుంటున్నారు.



• భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

9 లో..

# 'తెల్లం' నీడలో... ఆర్థిక కుంభకోణం

• భద్రాద్రి మన్యంలో పొలిటికల్ క్రైమ్ • ఎమ్మెల్యే నీడలో రూ. కోట్ల దందా! • పీఏ మోసాల వెనుక అసలు 'వాటాదారు' ఎవరు..? • ఆ లక్షల నగదు ఎవరి ఖాతాల్లోకి వెళ్లింది..? • కళ్యాణ్ కుమార్‌పై కేసుతో సరిపోతుందా..? • అసలు వేట మొదలయ్యేది ఎప్పుడు..? • బయటపడ్డ మరో 'తెల్లం' బండారం.. • కాపాడేందుకు చూస్తున్న ఓ మంత్రి..?

# కాంగ్రెస్ ప్రజాపాలనకు వెయ్యి రోజులు



- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సాగుతోంది
- బీఆర్ఎస్, బీజేపీ ఆరోపణలు అర్థరహితం
- విలేకరుల సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న

**కొత్తగూడెం, సెప్టెంబర్ 1, ప్రజాజ్యోతి:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తోందని డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న అన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ, ఉద్యోగాల భర్తీ వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రజాపాలనకు మధ్య స్పష్టమైన తేడాను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రజాపాలనకు వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యానగర్ కాలనీలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో

మిగతా 2 లో...

# ఇల్లందు పట్టణ అభివృద్ధికి రూ. 50 కోట్లు ఇవ్వండి

- -మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కోరం

**ఇల్లందు, సెప్టెంబర్ 1 (ప్రజాజ్యోతి)** ఇల్లందు పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి రూ. 50 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం హైదరాబాద్ లోని

మిగతా 2 లో...



# గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 1,(ప్రజా జ్యోతి)** ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. మంగళవారం ఐ.డీ.ఓ.సీ కార్యాలయంలోని సమావేశపు హాలులో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, పంచాయతి రాజ్, అగ్నిమాపక, ఐ.టీ.సీ,సింగరేణి, ఎక్సైజ్, విద్యుత్, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి పటిష్టమైన చర్యలు తీసుకావాలని అన్నారు. అన్ని గణేష్ మండపాలను తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ముందస్తుగా గణేష్ మండలి నిర్వాహకులు పూర్తి వివరాలు అందించాలని, ఇది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు,

మిగతా 2 లో...

# మారెళ్లపాడు లిఫ్ట్ కెనాల్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం

- కెనాల్ పనులు త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం



**అశ్వాపురం, సెప్టెంబర్ 1,ప్రజాజ్యోతి** అశ్వాపురం: మారెళ్ళపాడు కెనాల్ నిర్మాణ పనులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరిశీలించారు. కెనాల్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రైతులకు సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మారేడుపాడు కెనాల్ పనులు పూర్తయితే పరిసర ప్రాంతాల్లోని వేలాది ఎకరాలకు సాగునీటి సౌకర్యం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును పూర్తి చేయడంపై పూర్తిస్థాయిలో బాధ్యత తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పనుల్లో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కెనాల్ పనులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని, రైతులకు వీలైనంత త్వరగా నీరు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. రైతుల దీర్ఘకాలిక సాగునీటి అవసరాలను తీర్చేలా ప్రాజెక్టు పనులను పూర్తి చేయడానికి ప్రభుత్వం, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.

# వ్యవసాయ కళాశాలను ఆకస్మికంగా సందర్శించిన ఎమ్మెల్యే జారే

- విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం వంటగది నిర్వహణ పరిశీలన





**అశ్వారావు పేట ప్రజా జ్యోతి సెప్టెంబర్ 1** అశ్వారావుపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాలను గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గారు ఆకస్మికంగా సందర్శించారు ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు భోజన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు ముఖ్యంగా విద్యార్థులకు సాయంత్రం అందిస్తున్న అల్పాహారాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే అల్పాహారం నాణ్యత తయారీ విధానం తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు అనంతరం కళాశాలలో వంటగదులను పరిశీలించి అక్కడ వినియోగిస్తున్న కూరగాయలు ఇతర ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు విద్యార్థులకు నాణ్యమైన పరిశుభ్రమైన ఆహారం అందించడంలో ఎలాంటి రాజీ ఉండకూడదని ఈ సందర్భంగా సూచించారు విద్యార్థుల ఆరోగ్యం సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆహార పదార్థాల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం వంటగది నిర్వహణ కూరగాయల నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని ఆయన తెలిపారు.

# కాంగ్రెస్ ప్రజాపాలనకు వెయ్యి రోజులు

(మొదటి పేజీ తరువాయి...)

విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నీళ్లు, నిధులు, నియామకాలు, దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల భూమి, నిరుద్యోగ భృతి వంటి హామీలతో ప్రజలను మభ్యపెట్టి పదేళ్లపాటు కుటుంబ పాలన సాగించిందని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత కేసీఆర్ కుటుంబానిదేనని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేలు, రైతులకు ఉచిత విద్యుత్, సన్నవరి ధాన్యానికి రూ.500 బోనస్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డుల మంజూరు, సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు వైద్య సాయం, ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలల ఏర్పాటు, 72 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు, రూ.500కే గ్యాస్ సిలిండర్, వితంతు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ఆసరా పెన్షన్ల మంజూరు వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజాపాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీ, ఇతర ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. వారి ఆరోపణలు సూర్యుడిపై ఉమ్మివేసినట్లేనని, ప్రజలు వాటిని నమ్మబోరని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు మళ్లీ కాంగ్రెస్ ఇందిరమ్మ రాజ్యానికే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, కొత్తగూడెం నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆళ్ల మురళి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వ పనితీరును ఓర్వలేకనే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్, జిల్లా అధికార ప్రతినిధి వై. శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మంద హనుమంతు, ఎస్కే జానీ పాషా, కోశాధికారి కొదుమూరి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు పైడా రాజేంద్రప్రసాద్, లోశెట్టి నాగార్జున, జిల్లా కార్యదర్శి ఆంతోటి పాలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతలపూడి రాజశేఖర్, మడుపల్లి శ్రీనివాసరావు, సీతారామయ్య, మండల అధ్యక్షులు భువన సుందర్‌రెడ్డి, నర్రా అజయ్‌కుమార్, జేమ్స్ సునీల్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 4న సీతారాంపురం అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన

- -భక్తిశ్రద్ధలతో పాల్గొనే భక్తులకు అమ్మవారి అనుగ్రహం లభిస్తుందని ఆలయ అర్చకుల వివరణ



**పినపాక, సెప్టెంబర్ 01(ప్రజాజ్యోతి)** పినపాక మండలం సీతారాంపురం గ్రామంలోని అమ్మవారి ఆలయంలో సెప్టెంబర్ 4వ తేదీ శుక్రవారం ప్రత్యేక కుంకుమార్చన పూజను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు పెద్దచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనతో పాటు భక్తులకు దర్శనం, తీర్థప్రసాదాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కుంకుమార్చన పూజకు ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టమైన స్థానం ఉందని ఆలయ అర్చకులు వివరించారు. అమ్మవారిని శక్తి స్వరూపిణిగా భావిస్తూ కుంకుమతో పూజించడం ద్వారా భక్తులు తమ మనసులోని కోరికలను అమ్మవారి సన్నిధిలో సమర్పించుకుంటారని తెలిపారు. కుంకుమార్చన సమయంలో అమ్మవారి నామస్మరణ చేస్తూ భక్తిశ్రద్ధలతో పూజలో పాల్గొనడం వల్ల మనసుకు ప్రశాంతత, ఆధ్యాత్మిక ధైర్యం కలుగుతాయని వివరించారు.అమ్మవారి అనుగ్రహం కోసం నిర్వహించే ఈ పూజలో మహిళలు ప్రత్యేకంగా పాల్గొనడం ఆనవాయితీగా వస్తోందని అర్చకులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఆరోగ్యం, సుఖసంతోషాలు, ఐక్యత, శాంతి కోసం భక్తులు అమ్మవారిని ప్రార్థిస్తారని చెప్పారు. ముఖ్యంగా కుటుంబంలో ఉన్న సమస్యలు తొలగిపోవాలని, ఇంట్లో సానుకూల వాతావరణం నెలకొనాలని కోరుతూ కుంకుమార్చనలో పాల్గొనే భక్తులు తమ మొక్కులు చెల్లించుకుంటారని వివరించారు. "అమ్మవారిపై విశ్వాసంతో, భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలో పాల్గొనడం ద్వారా మనసుకు ప్రశాంతత, కుటుంబానికి సుఖశాంతులు, జీవితంలో ఆధ్యాత్మిక ధైర్యం లభిస్తాయని భక్తుల విశ్వాసం. అమ్మవారి కృప ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరుకుంటున్నాం" అని ఆలయ అర్చకులు తెలిపారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

(మొదటి పేజీ తరువాయి...)

మండల స్థాయిలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమావేశాలు నిర్వహించాలని, గణేష్ నవరాత్రి ఉత్సవాలు మొదటి రోజు నుండి నిమజ్జనం వరకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రశాంత వాతావరణంలో, అవాంచనీయ సంఘటనలు తావు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మండపాలకు విద్యుత్ ఏర్పాటుకు తప్పని సరిగా విద్యుత్ శాఖ నుండి అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలుపై విద్యుత్ అధికారులు మండపాల్లో ఆడిట్ నిర్వహించాలని సూచించారు. విద్యుత్ తీగలకు తగల కుండా ఎత్తు తక్కువ ఉండే విగ్రహాలు ఏర్పాటు చేయాలని అన్నారు. మండపాల్లో మైక్ ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని తెలిపారు. భద్రాద్రి జిల్లా నుండే కాకుండా ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి నిమజ్జనానికి విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున యంత్రాంగం సూచించిన ప్రాంతాల్లో మాత్రమే భద్రత మధ్య నిమజ్జన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తెలియజేసారు. గణేష్ నిమజ్జనం చేసుకునేందుకు అవసరమైన రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులను కోరారు..వినాయక నిమజ్జనానికి వినియోగించే వాహనాలను ముందస్తుగా రవాణాశాఖ అధికారి నుండి ధ్రువీకరణ తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం సందర్భంగా క్రేన్లు వినియోగించాలని, గణేష్ నిమజ్జనం జరిగే ప్రదేశాలలో గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల సహకారంతో కలిసికట్టుగా పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని అన్నారు. భక్తులకు అందించే స్వామి వారి ప్రసాదాలకు ప్లాస్టిక్ వస్తువులు వినియోగించొద్దని పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని తెలిపారు. వ్యర్థాలు వేసేందుకు డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని, రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసే విగ్రహాలు పర్యావణానికి హాని కలిగిస్తాయన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో ఉచిత మట్టిగణపతులు పంపిణీ చేయనున్నామని, ప్రజలు మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాళ్ శ్రేష్ఠ, డీ.ఆర్.ఓ పద్మావతి, ఆర్ టీ.ఓ వి వెంకట రమణ, జిల్లా ఇంచార్జ్ ఎక్సైజ్ ఈ.ఎస్ జానయ్య, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతి కుమార్, డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ తుకారాం రాథోడ్, విద్యుత్ శాఖ ఎస్.ఈ మహేంద్ర, కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ సుజాత, ఐటీసీ, సింగరేణి సంస్థ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కొత్తగూడెం గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యెర్రా కామేష్, సభ్యులు దారా రమేష్, లక్ష్మణ్, వందనపు శ్రీధర్, మహేష్, సుజాత, విజయలక్ష్మి, యాకయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు పట్టణ అభివృద్ధికి రూ. 50 కోట్లు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి...)

సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. మంత్రిని ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దొడ్డా కిరణ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పట్టణ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇల్లందు పట్టణం నానాటికీ విస్తరిస్తుందని, సింగరేణి ప్రాంతం కావడంతో జనాభా పెరుగుదల ఎక్కువగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వ్యవస్థ, పార్కుల అభివృద్ధి, స్ట్రీట్ లైట్లు, మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు అవసరం ఉన్నాయని తెలిపారు. ఇల్లందు పట్టణ ప్రజల చిరకాల వాంఛ అయిన 76 జీఓ సమస్యను పరిష్కరించాలని కోరారు. 76 జీఓ వల్ల ఇల్లందులోని వేలాది కుటుంబాలకు ఇళ్ల పట్టాల సమస్య ఏళ్లుగా పెండింగ్ లో ఉందని, దీనిని త్వరగా పరిష్కరించి పట్టాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణం నడిబొడ్డున ఉన్న ఫారెస్ట్ గ్రౌండ్ ను ఇల్లందు మున్సిపాలిటీకి అప్పగిస్తే అక్కడ అధునాతన పార్కు, క్రీడా మైదానం, ప్రజా ఉపయోగకరమైన నిర్మాణాలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఇల్లందు పట్టణ అభివృద్ధిపై తమ ప్రభుత్వానికి ప్రత్యేక దృష్టి ఉందని, ముందుగా అసెంబ్లీ సమావేశాల అనంతరం రూ. 25 కోట్ల నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన నిధులను విడతల వారీగా కేటాయిస్తామని తెలిపారు. అలాగే 76 జీఓ విషయంలో కూడా అసెంబ్లీ సమావేశాల అనంతరం పూర్తిగా పరిశీలించి ఇల్లందు పట్టణ ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తానని, ఫారెస్ట్ గ్రౌండ్ ను మున్సిపాలిటీకి అప్పగించే అంశాన్ని సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొడ్డా కిరణ్ డానియల్, కౌన్సిలర్లు కొర్లపాటి శివ కిరణ్, జాఫర్, సైదుమియా, రాజు గౌడ్, నీలపూరి రమేష్, కో–ఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి, పట్టణ అధ్యక్షులు బోళ్ల సూర్యం, కాంగ్రెస్ నాయకులు దొడ్డ డానియల్, పెండేల హరికృష్ణ, పర్రె శ్రీనివాస్, శనిగరపు రమేష్, పందిళ్ల వెంకటేశ్వర్లు, ఉల్లంగి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

- ప్రజాధనానికి లెక్క చెప్పి - ప్రజలకు కనిపించని ప్రతిపక్ష నాయకుడు వెంటనే తన పదవికి రాజీ నామా చేయాలి
- భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 1, ప్రజా జ్యోతి** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు ఆధ్వర్యంలో మంగళవారం భద్రాచలంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు, ఈ ర్యాలీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభమై అం బేద్కర్ సెంటర్, యూబీ రోడ్, నెహ్రూ మార్కెట్, జీసీసీ రోడ్డు మీదుగా తిరిగి అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగింది. అనంతరం అంబేద్కర్ సెంటర్ వద్ద ఎమ్మెల్యే తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు మీడియాతో మాట్లాడారు. దేశంలో ఏ ప్రతిపక్ష నాయకుడైనా ప్రజలకు దూరంగా ఉంటూ, సుమారు 1000 రోజులుగా ఫామ్‌హౌస్‌కే పరిమితమైన పరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం విఫలమైతే ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించాల్సిన ప్రధాన ప్రతిపక్ష నాయకుడే ప్రజలకు దూరంగా ఉంటే ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పాత్ర ఏమిటని నిలదీశారు. గత మూడు సంవత్సరాలుగా ప్రజల సొమ్ము రూ.22 కోట్ల 24 లక్షల 40 వేల మొత్తాన్ని తీసుకుంటూ ప్రజలకు ముఖం చూపించని వ్యక్తి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారని తెలిపారు. ఈ డి మాండ్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు మండల కేంద్రాల్లో సైకిల్, మోటార్ సైకిల్ ర్యాలీలు, జిల్లా కేంద్రా ల్లో భారీ ర్యాలీలు నిర్వహించాలని, అం బేద్కర్ చౌరస్తాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించాలని సీఎం కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారని అన్నారు, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బైక్ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ఎన్ ఎస్ యు ఐ యూత్ కాంగ్రెస్ నాయకుల తో పాటు భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ నాయకులు , కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మల్లికార్జున స్వామిని దర్శించుకున్న ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి

- స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎం. నాగరాజు



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 1 (ప్రజాజ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండలంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి దేవస్థానాన్ని ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి వీవీ రమణ వారికి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి శేష వస్త్రాన్ని అందజేశారు. ఆలయ విశిష్టత, నిర్వహణకు సంబంధించిన వివరాలను వీవీ రమణ వివరించారు. న్యాయమూర్తి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో అన్నపురెడ్డిపల్లి ఎస్సై విజయసింహారెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి వీవీ రమణ, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నవచైతన్య ప్రెస్ క్లబ్‌కు నూతన కమిటీ

- గౌరవ అధ్యక్షుడిగా కుందూరు శ్రీనివాస్ రెడ్డి.. అధ్యక్షుడిగా కొడారి వెంకటేశ్వర్లు



**అశ్వాపురం, సెప్టెంబర్1,ప్రజాజ్యోతి** అశ్వాపురం నవచైతన్య ప్రెస్ క్లబ్ నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధితో పాటు ప్రెస్ క్లబ్‌ను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా నూతన కమిటీ పనిచేయాలని నిర్ణయించింది.నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా కుందూరు శ్రీనివాస్ రెడ్డి, గౌరవ సలహాదారుడిగా తునికేశి సురేందర్ రెడ్డి ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా కొడారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా కె.వి. రెడ్డి, పగడాల వెంకటరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.ప్రధాన కార్యదర్శిగా త్రిపురారి నెహ్రూ, కోశాధికారిగా ఎస్కే ఖదీర్, సహాయ కార్యదర్శులుగా గరికపాటి అంజన్ రావు, అప్పన మురళి, ప్రచార కార్యదర్శిగా దేపంగి వెంకటరమణ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా రాంబాబు, మండల విజయ్ కుమార్, అలవాల నాగరాజు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ జర్నలిస్టుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ, వారి సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు.మండలంలోని ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు వాస్తవాలను ఎలాంటి పక్షపాతం లేకుండా అందించడమే తమ ప్రధాన బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే నవచైతన్య ప్రెస్ క్లబ్‌ను మరింత అభివృద్ధి చేసి జర్నలిస్టులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. జర్నలిస్టులందరి సహకారంతో ప్రెస్ క్లబ్‌ను మరింత ముందుకు తీసుకెళ్తామని వారు పేర్కొన్నారు.

# 48 గంటల రిలే దీక్షలు ప్రారంభం



**చర్ల, సెప్టెంబర్ 01:(ప్రజా జ్యోతి):** ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్రాల కన్వీనర్ సొందే వీరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం చర్ల మండల కేంద్రంలోని కొమరం భీం విగ్రహం వద్ద గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో 48 గంటల రిలే దీక్షలు ప్రారంభమయ్యాయి.దీక్షల ప్రారంభానికి ముందు ఇటీవల మృతి చెందిన ఉయక శిరీషకు నాయకులు, కార్యకర్తలు ఒక నిమిషం మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం సొందే వీరయ్య మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ మహిళలను లక్ష్యంగా చేసుకుని అత్యాచారాలు, అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.భద్రాచలం కేంద్రంగా గత రెండు దశాబ్దాలుగా ఆదివాసీలను చైతన్యపరుస్తూ అనేక ఉద్యమాలు నిర్వహించామని తెలిపారు. ఆ ఉద్యమాల ఫలితంగానే అనేక మంది ఆదివాసీ నిరుద్యోగులు జీవో నంబర్ 3 ద్వారా ఉద్యోగాలు పొంది లబ్ధి పొందారని పేర్కొన్నారు. 1998 నుంచి 2017, 2018 వరకు జీవో నంబర్ 3 అంశంపై సుప్రీంకోర్టులో కేసు కొనసాగిందని గుర్తుచేశారు. ఏజెన్సీ ప్రాంత యువత హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించకపోతే భవిష్యత్తులో ఏజెన్సీ చట్టాలను నిర్వీర్యం చేసేందుకు గిరిజనేతరులు కుట్రలు చేసే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణకు యువత ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.తొలి రోజు రిలే దీక్షలకు ముమ్మినేని అరవింద్, ఎమ్మార్పీఎస్ నాయకుడు సీహెచ్ రామ్మూర్తి, మండల కమిటీ నాయకులు మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు బీరబోయిన శేఖర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొంది లీలాప్రసాద్, బీరబోయిన అరుణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరప అంజిబాబు, మండల అధ్యక్షుడు కాయం శ్రీనివాసరావు, మండల కార్యదర్శి, డివిజన్ నాయకులు పాయం సన్యాసి, యాలం నరసింహారావు, ఆదివాసీ సీనియర్ నాయకులు బీరబోయిన నాగయ్య, శ్యామల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు అక్రమ అరెస్టును నిరసిస్తూ కొత్తగూడెంలో రాస్తారోకో



**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 1 ,(ప్రజా జ్యోతి)** తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు అక్రమంగా అరెస్టును నిరసిస్తూ కొత్తగూడెం జిల్లా బిజెపి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో నిరసన, రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు, అదేవిధంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయం నల్గొండ జిల్లా బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ గుండాలు దాడికి పాల్పడిన ఘటనను బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా కొత్తగూడెం జిల్లా బిజెపి అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం, రాజకీయ పార్టీ కార్యాలయాలపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. ఇలాంటి చర్యలకు రాబోయే రోజుల్లో ప్రజాక్షేత్రంలో ప్రజాస్వామ్య పద్ధతిలో తగిన సమాధానం చెబుతామని తీవ్రంగా హెచ్చరించారు.ప్రజా పాలన పేరుతో అధికారంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజా సమస్యల పరిష్కారాన్ని పక్కనపెట్టి బీజేపీని అణగదొక్కే ప్రయత్నాలకు ప్రాధాన్యత ఇస్తోంద నీ ,ఇది ప్రజాస్వామ్యానికి సరైంది కాదన్నారు,ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు పరిపాలనను గాలికి వదిలేసి, బీజేపీని ఏ విధంగా అణగదొక్కాలనే ఆలోచనలో ఉన్నారని ఆయన విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం, జిల్లాలోని సమస్యలను పరిష్కరించడం, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.బీజేపీ నాయకులు, కార్యకర్తలపై ఎలాంటి అణచివేత చర్యలు చేపట్టినా ప్రజాస్వామ్య పద్ధతిలో బలమైన పోరాటం కొనసాగిస్తామని అన్నారు, ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి డా. జాటోత్ వెంకన్న నాయక్ ,నాలుగో డివిజన్ కార్పొరేటర్ జిల్లా ఉపాధ్యక్షురాలు చెరుకు భాగ్యలక్ష్మి , చుంచుపల్లి మండల అధ్యక్షులు బలగం శ్రీధర్ ,లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షులు నవీన్ , యువ మోర్చా జిల్లా అధ్యక్షులు జుజ్జూరు మోహన్ కృష్ణ , మహిళా మోర్చా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి , ఎస్సీ మోర్చా అధ్యక్షులు చాపలమడుగు రాకేష్ , మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి స్వప్న , ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బడే రమేష్ , ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు వీర ప్రతాప్ , ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చంటి రాజు , యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కోల హరీష్, పొదిళ్ల శీన, శంకర్ , బుర్ర సతీష్ , రతన్ లాల్ పాసి , ముత్యాల వంశీ , ఎండోమెంట్ సెల్ కన్వీనర్ సుధాకర్ , సీనియర్ బీజేపీ నాయకులు చిన్న , రేఖ రాజ శేఖర్ , మురళి ,యువ మోర్చా కార్యదర్శి ధారావత్ నరేష్ ,తదితర బీజేపీ నాయకులు, పాల్గొన్నారు.

# ఉయిక శిరీషకు న్యాయం చేయాలి

**చర్ల, సెప్టెంబర్ 01:(ప్రజాజ్యోతి):** హైదరాబాద్ తుక్కుగూడలో అత్యాచారానికి గురై అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఆదివాసీ యువతి ఉయిక శిరీషకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చర్ల మండలం దానవాయిపేట గ్రామంలో మంగళవారం గ్రామస్తులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.ఆర్.కొత్తగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ తుర్రం రవికుమార్ ఆధ్వర్యంలో యువత, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు ర్యాలీలో పాల్గొన్నారు. గ్రామ ప్రధాన రహదారిపై కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి, ఉయిక శిరీష చిత్రపటానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శిరీష మృతికి సంబంధించిన ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుడిగా పేర్కొంటున్న సైనావుల్లాపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఆదివాసీ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మహిళలకు భద్రత కల్పించడంలో అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాలని ఇర్ప సంఘమిత్ర, నూప రమేష్ కోరారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని దానవాయిపేట యువత డిమాండ్ చేసింది.ఈ నిరసన కార్యక్రమంలో సర్పంచ్ తుర్రం రవికుమార్, ఉపసర్పంచ్ కాపుల కృష్ణ అర్జునరావు, దానవాయిపేటకు చెందిన రుంజ రాజా, పీఈఎస్ఏ సమన్వయకర్త నూప రమేష్, ఆదివాసీ యువ నాయకులు ఇర్ప సంఘమిత్ర, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నేడు నిర్వహించే వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- కాంగ్రెస్ పినపాక మండల అధ్యక్షులు పేరం వెంకటేశ్వర్లు



**పినపాక, సెప్టెంబర్ 01(ప్రజాజ్యోతి** దివంగత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా రేపు ఉదయం 9 గంటలకు బయ్యారం క్రాస్‌రోడ్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పేరం వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి సర్పంచులు, ఉపసర్పంచులు, జిల్లా, మండల నాయకులు, ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వైఎస్సార్‌కు ఘన నివాళులు అర్పించేందుకు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ తప్పక పాల్గొనాలని కోరారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

- జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి




**చర్ల, సెప్టెంబర్ 01:(ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగలక్ష్మి మంగళవారం చర్ల మండలంలో పర్యటించి గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.ముందుగా ఆర్.కొత్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న మురుగు కాలువ చివరి ఇంకుడు గుంత పనులను పరిశీలించారు. సత్యనారాయణపురం గ్రామంలో చేపడుతున్న ఫామ్ పాండ్ పనులను పరిశీలించి, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం చర్ల గ్రామపంచాయతీ రైతు వేదికలో వీబీ–జీఆర్ఏఎం–జీ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలైన జలసిరి, గ్రామపంచాయతీ ప్రణాళిక, సామాజిక–ఆర్థిక సాధికారత ప్రణాళిక సర్వే, ఉపాధి హామీ పథకం కూలీల సమీకరణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, వ్యవసాయానికి అవసరమైన నీటి వనరుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఈఓ నాగలక్ష్మి సూచించారు. జలసిరి, వ్యవసాయ క్షేత్ర నీటి గుంటలు, మురుగు కాలువ చివరి ఇంకుడు గుంతలు వంటి నీటి సంరక్షణ పనులను గుర్తించి ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక కింద గ్రామాల అవసరాలను గుర్తించి, ప్రజలకు ఉపయోగకరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో ప్రణాళికలో చేర్చాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో సామాజిక–ఆర్థిక సాధికారత సర్వేను సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన కుటుంబాలు, అవసరమైన పనులను గుర్తించాలని సూచించారు.ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులకు అవసరమైన సంఖ్యలో కూలీలను సమీకరించేందుకు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామాల్లో కూలీలకు విస్తృతంగా ఉపాధి కల్పించడంతో పాటు అందుబాటులో ఉన్న పనులకు అనుగుణంగా కూలీల సమీకరణను పెంచాలని సూచించారు.ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించేందుకు అధికారులు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్.కొత్తగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ తుర్రం రవికుమార్, ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ మూర్తి, ఏపీఓ సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శులు శోభారాణి, హర్షిణి, టి ఏ బాలరాజు, ఎఫ్ ఏ తిరుపతి, సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కార్మిక వాడల్లో ఫాగింగ్ ఎక్కడ..?

- కార్మికులు అంటే అంత అలుసా!
- నెలలు గడుస్తున్న ఫాగింగ్ చేయని వైనం
- 3 నెలల క్రితం ఫాగింగ్‌కు టెండర్ కేటాయింపు
- జెకె, 24 ఏరియాలలో కానరాని ఫాగింగ్!
- ఉచితంగా మస్టర్లు ఇస్తున్నారా?
- సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?
- ఉన్నతాధికారులు జర పట్టించుకోరూ!
- కార్మికులు, కార్మిక కుటుంబాల ఆరోగ్యాన్ని కాపాడరూ!



**ఇల్లందు, సెప్టెంబర్ 1 (ప్రజా జ్యోతి)** కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పే అధికారులు.. వారి ఆరోగ్య పరిరక్షణ విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్మిక వాడల్లో దోమల బెడద తీవ్రంగా ఉన్నప్పటికీ, దోమల నివారణకు చేపట్టాల్సిన ఫాగింగ్ ప్రక్రియ నెలల తరబడి నిలిచిపోయిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కార్మికులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

### మూడు నెలల క్రితమే టెండర్ కేటాయింపు..

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని కార్మిక వాడల్లో ఫాగింగ్ నిర్వహించేందుకు సుమారు మూడు నెలల క్రితమే టెండర్ కేటాయించినట్లు సమాచారం. అయితే టెండర్ ప్రక్రియ పూర్తయినా క్షేత్రస్థాయిలో ఫాగింగ్ సేవలు ఎంతమేరకు అందుతున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. టెండర్ కేటాయించి నెలలు గడుస్తున్నా కార్మిక వాడల్లో దోమల నివారణ చర్యలు కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

### జేకే, 24 ఏరియాల్లో ఫాగింగ్ ఎక్కడ..?

ఇల్లందు ఏరియాలో కార్మికులు నివసించే జేకే కాలనీ, 24 ఏరియాల్లో ఫాగింగ్ జరిగిన దాఖలాలు కనిపించడం లేదని పలువురు కార్మికులు, స్థానికులు వాపోతున్నారు. సాయంత్రం వేళల్లో దోమల తీవ్రత పెరుగుతున్నప్పటికీ ఫాగింగ్ వాహనం తమ ప్రాంతాలకు రావడం లేదని చెబుతున్నారు. సంబంధిత అధికారులు ఈ ప్రాంతా ల్లో పరిస్థితిని పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరుతున్నారు.

### దోమలతో కార్మిక కుటుంబాల అవస్థలు..

కార్మిక వాడల్లో పారిశుద్ధ్య పరిస్థితులు, వర్షాకాల ప్రభావంతో దోమల సంఖ్య పెరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దోమల నివారణ చర్యలు సకాలంలో చేపట్టకపోతే కార్మిక కుటుంబాలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల ఆరోగ్యం పై ముందస్తు చర్యలే మేలు అని వారు పేర్కొంటున్నారు.

### మస్టర్లు మాత్రం సక్రమంగానేనా..?

ఫాగింగ్ పనులకు సంబంధించి సిబ్బంది, వాహనాల వినియోగం, నిర్వహించిన ప్రాంతాలు, రోజుల వారీగా చేపట్టిన పనుల వివరాలు వంటి అంశాలు పారదర్శకంగా ఉండాల్సిన అవసరం ఉందని పలువురు అంటున్నారు. క్షేత్రస్థాయిలో ఫాగింగ్ కనిపించకపోయినా మస్టర్లు, పనుల రికార్డులు మాత్రం ఎలా నమోదవుతున్నాయన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు సమగ్రంగా తనిఖీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..?

కార్మిక వాడల్లో ఫాగింగ్ పనులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అనేది సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించే వారు లేకపోవడంతోనే ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. టెండర్ కేటాయింపుతో అధికారులు తమ బాధ్యత ముగిసినట్లుగా భావించకుండా.. పనులు వాస్తవంగా జరుగుతున్నాయా లేదా చూడాలని కార్మికులు కోరుతున్నారు.

### ఉన్నతాధికారులు జర పట్టించుకోరూ..

కార్మిక వాడల్లో ఫాగింగ్ సమస్యపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. కాగితాలపై పనులు పూర్తయినట్లు చూపకుండా క్షేత్రస్థాయిలో ఫాగింగ్ నిర్వహణపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే గత మూడు నెలల్లో ఫాగింగ్ నిర్వహించిన ప్రాంతాలు, తేదీలు, వినియోగించిన సిబ్బంది, వాహనాల వివరాలను పరిశీలించాలని కోరుతున్నారు.

### కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడరూ..?

ఏ సంస్థకైనా కార్మికులే వెన్నెముక. అలాంటి కార్మికులు, వారి కుటుంబాలు నివసించే ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణ చర్యలు సక్రమంగా ఉండాల్సిన అవసరం ఉంది. దోమల నివారణ వంటి కనీస చర్యల్లో జాప్యం జరిగితే దాని ప్రభావం నేరుగా కార్మిక కుటుంబాలపై పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జేకే, 24 ఏరియాలలోని కార్మిక వాడల్లో విస్తృతంగా ఫాగింగ్ చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు.

### టెండర్ పై సమగ్ర పరిశీలన తప్పనిసరి

మూడు నెలల క్రితం టెండర్ కేటాయించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎక్కడెక్కడ ఫాగింగ్ నిర్వహించారు..? ఎన్ని రోజులు నిర్వహించారు..? ఎంత మంది సిబ్బందిని వినియోగించారు..? ఎంత మేరకు బిల్లులు చెల్లించారు..? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని పలువురు కోరుతున్నారు. వాస్తవ పరిస్థితులకు, రికార్డుల్లో నమోదైన వివరాలకు తేడా ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఇప్పటికైనా చర్యలు తీసుకునేనా..?

కార్మికుల ఆరోగ్యంతో ముడిపడిన ఫాగింగ్ వ్యవహారంలో ఇకనైనా అధికారులు తక్షణ చర్యలు చేపట్టి, కార్మిక వాడల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు, వారి కుటుంబ సభ్యులు కోరుతున్నారు. అదే సమయంలో సంబంధిత టెండర్, పనుల అమలు, మస్టర్లపై పారదర్శకంగా విచారణ జరిపితే అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని కార్మికులు, కార్మిక కుటుంబాలు పేర్కొంటున్నారు.

## ఆదివాసీ యువతి మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- బీజేపీ మండల అధ్యక్షుడు నూప రమేష్

**చర్ల, సెప్టెంబర్ 01:(ప్రజాజ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఆదివాసీ యువతి తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన ఘటనపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని చర్ల మండల బీజేపీ అధ్యక్షుడు నూప రమేష్ డిమాండ్ చేశారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ యువతి మృతి అత్యంత బాధాకరమైన ఘటన అని ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి నిష్పక్షపాతంగా అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు. యువతి మృతికి కారణమైన వారు ఎంతటి ప్రభావవంతమైన వ్యక్తులైనా చట్టం ముందు అందరూ సమానమేనని, దర్యాప్తులో నేరం రుజువైతే చట్టపరంగా కఠినమైన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఉద్యోగం కోసం ఇంటికి దూరంగా వెళ్లే ఆదివాసీ మహిళలకు భద్రత కల్పించే బాధ్యత ఎవరిది, మహిళల భద్రతపై ప్రభుత్వం చేస్తున్న హామీలు క్షేత్రస్థాయిలో ఎందుకు అమలు కావడం లేదనే అంశాలపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని రమేష్ కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వెల్లడించాలని అన్నారు.ప్రైవేట్ ఆసుపత్రులు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న మహిళల భద్రతపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు అవసరమైన న్యాయ సహాయం కల్పించాలని కోరారు.బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీజేపీ అండగా ఉంటుందని రమేష్ స్పష్టం చేశారు. నిందితులు ఎవరైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతగా ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు బాబా పాహీం, జిల్లా కార్యవర్గ సభ్యుడు గునురి రమణ, మండల ప్రధాన కార్యదర్శి బి.సందీప్, మండల యువ మోర్చా అధ్యక్షుడు పి.వినయ్, మండల కార్యదర్శులు ముత్తవరపు శ్రీనివాస్, చారి విశ్వనాథ, కుప్పా మాధవరావు, ఇర్ప సుబ్బారావు, సుక్క శివ, సంతపూర్ సతీష్, యూక రాంబాబు, కే.శివ, సుక్క శ్రీనివాస్ పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- **1000 రోజులు ప్రజా పాలనకు నిదర్శనం**



**చర్ల, సెప్టెంబర్ 01:(ప్రజాజ్యోతి):** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. టీపీసీసీ, డీసీసీ, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సమావేశానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2023 డిసెంబర్ లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి, యువతకు అవకాశాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ పాలన కొనసాగిస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనం కలుగుతోందని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, అర్హులకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా అర్హత కలిగిన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు.అర్హులైన పేద కుటుంబాలకు సొంత ఇళ్లను కల్పించే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం, రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా, పంటలకు బోనస్ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా అర్హులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.అలాగే ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, నియామక ప్రక్రియలను వేగవంతం చేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.1000 రోజుల పాలన కేవలం రోజుల లెక్క కాదని, సంక్షేమ పథకాల ద్వారా మహిళలు, రైతులు, పేదలు, యువతకు అందుతున్న ప్రయోజనాలకు ఇది ప్రతిబింబమని నాయకులు తెలిపారు. ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి, అవకాశాల కల్పనను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లంక రాజు, కొసరాజా రాజ, పిలక వెంకటరమణరెడ్డి, నూపా కృష్ణ, పాలం నవీన్, మేడబత్తిన వాసు, చీమకుర్తి సాయిచరణ్, చీంతురి రజనీకాంత్, గంగరాజు సీతారాములు, మురళీధర్ నాయుడు, మహిళా కాం గ్రెస్ నాయకులు కట్టా అమ్మాజీ, స్వరూ ప, గిరిజ, సరోజినీ, వరలక్ష్మి , అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చర్ల పీహెచ్‌సీలో ఆశా డే కార్యక్రమం



**చర్ల, సెప్టెంబర్ 01 :(ప్రజాజ్యోతి ):** చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశా డే కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ సందర్శించి ఆశా ఆరోగ్య కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వారం పోషకాహార లోపంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, ప్రొటీన్లు తదితర పోషకాలు ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు, ఇతర సమతుల్య ఆహార పదార్థాల ద్వారా లభిస్తాయని ప్రజలకు వివరించాలని తెలిపారు. సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని అవగాహన కల్పించాలన్నారు.ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్ 5 వరకు నిర్వహిస్తున్న నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా నేత్రదానం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఒక వ్యక్తి నేత్రదానం ద్వారా పలువురికి చూపును అందించే అవకాశం ఉంటుందని, స్వచ్ఛందంగా నేత్రదానానికి ముందుకు వచ్చేలా ప్రజలను చైతన్యపరచాలని తెలిపారు.జిల్లా క్షయవ్యాధి నియంత్రణ కార్యక్రమ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధి పరీక్షలు చేయించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వం క్షయవ్యాధి రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందిస్తోందని, వైద్యుల సూచనల మేరకు మందులను క్రమం తప్పకుండా వాడితే వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు.డిప్యూటీ డీఎంహెచ్ఓ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ చిన్నారులకు జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ప్రకారం అన్ని టీకాలను నిర్ణీత సమయంలో వేయించాలని సూచించారు. ఒక్క టీకా కూడా మిస్ కాకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. టీకాల ద్వారా పోలియో వంటి తీవ్రమైన వ్యాధులను నియంత్రించగలిగామని, టీకాలతో నివారించగల వ్యాధుల నుంచి ప్రజలను రక్షించేందుకు కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రజలకు సూచించాలని తెలిపారు. ప్రతి శుక్రవారం నిర్వహించే 'ఫ్రైడే డ్రై డే' కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా చేపట్టి ఇళ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకునేలా ప్రజలను చైతన్యపరచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ విద్రోహ దినం కార్యక్రమం

- **నల్ల బ్యాడ్జీలతో అధ్యాపకుల నిరసన**



**చర్ల, సెప్టెంబర్ 01:(ప్రజాజ్యోతి):** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి (టీజీఈజేఏసీ) పిలుపు మేరకు సెప్టెంబర్ 1న 'పెన్షన్ విద్రోహ దినం' సందర్భంగా చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్‌తో టీజీఈజేఏసీ చేపడుతున్న కార్యక్రమాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. టీజీఈజేఏసీ తీసుకునే ప్రతి నిర్ణయాన్ని అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది కలిసి విజయవంతం చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీమతి జయశ్రీతో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# శిరీషకు న్యాయం కోసం కొవ్వొత్తుల ర్యాలీ

**చర్ల, సెప్టెంబర్ 01:(ప్రజాజ్యోతి ):** ఆదివాసీ యువతి ఉయిక శిరీష మృతికి కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ తుడుం దెబ్బ ఆధ్వర్యంలో మంగళవారం చర్ల మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం సౌటిగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి ఉయిక శిరీషపై హైదరాబాద్‌లో జరిగిన దారుణ ఘటనను తుడుం దెబ్బ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఘటనకు బాధ్యుడిగా పేర్కొంటున్న ఇషాద్ ఖాన్‌పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వాసం ముసలయ్య మాట్లాడుతూ శిరీష మృతికి కారణమైన నిందితుడిని వెంటనే అరెస్టు చేసి చట్ట ప్రకారం అత్యంత కఠినమైన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.ర్యాలీలో పాల్గొన్న, కార్యకర్తలు కొవ్వొత్తులు వెలిగించి శిరీషకు నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, మహిళలకు భద్రత కల్పించాలని నినాదాలు చేశారు.



# నిరుద్యోగ యువతకు ఉచిత పోలీస్ శిక్షణ

- **కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు ఉచిత వసతి సౌకర్యం**



**చర్ల, సెప్టెంబర్ 01(ప్రజాజ్యోతి ):** చర్ల మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులకు పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ, ఉచిత వసతి సౌకర్యం కల్పించనున్నట్లు చర్ల పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ ఆలేం రాజువర్మ తెలిపారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్, ఐపీఎస్ సూచనల మేరకు నూతనంగా వెలువడనున్న పోలీస్ నియామకాల్లో కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల కు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఈ సౌకర్యాలను అందించనున్నట్లు అన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకునే అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి సెప్టెంబర్ 3వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు చర్ల మం డల పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలని ఎస్‌హెచ్ఓ సూచించారు. నిరుద్యోగ యు వత ఈ అవకాశాన్ని వినియోగించుకుని పోలీస్ ఉద్యోగాల సాధనకు సిద్ధం కావాలని కోరారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- **సమావేశంలో మాట్లాడుతున్న చిన్నంశెట్టి**



**అశ్వారావుపేట టౌన్, సెప్టెంబర్ 1 ప్రజా జ్యోతి :** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని కాంగ్రెస్ మండల కన్వీనర్ చిన్నంశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన ఈ వెయ్యి రోజులకాలంలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పలు ప్రజా సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని ఆయన అన్నారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మె ల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలతో పాటుగా మరికొన్ని సంక్షేమ పథకాలను కూడా నూటికి నూరు శాతం అమలు చేస్తున్నామని ఇది చారిత్రాత్మకం అని అన్నారు. అలాగే రానున్న కాలంలో మరిన్ని ప్రజా సంక్షే మ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తామని పేర్కొన్నారు. అతి త్వరలోనే నూతన పెన్షన్లు , ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత మంజూరు, నియోజకవర్గ కేంద్రంలో కోట్లాది రూపాయల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు, స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తుమ్మా రాంబాబు, సత్యం రామకృష్ణ, ఊట్లపల్లి సర్పంచ్ సత్యం ప్రసన్నలక్ష్మి , వేల్పుల సత్యనారాయణ, పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను సన్మానించిన మున్సిపల్ పాలకవర్గం

**ఇల్లందు, సెప్టెంబర్ 1 (ప్రజా జ్యోతి )** తెలంగాణ శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఇల్లందు మున్సిపల్ పాలకవర్గం మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మున్సిపల్ చైర్మన్ దొడ్డా కిరణ్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో అత్యంత కీలకమైన అంచనాల కమిటీ చైర్మన్‌గా ఇల్లందు ఎమ్మెల్యే ఎన్నిక కావడం ఇల్లందు నియోజకవర్గానికే గర్వకారణమని, ప్రభుత్వ నిధుల వినియోగం, లెక్కల పారదర్శకతను పరిశీలించే అత్యున్నత కమిటీకి నేతృత్వం వహించే అవకాశం రావడంతో ఇల్లందు అభివృద్ధికి మరింత చేయూత లభిస్తుందని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి, ముఖ్యమంత్రి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానని, ఇల్లందు మున్సిపాలిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొర్లపాటి శివ కిరణ్, జాఫర్, సైదుమియా, రాజు గౌడ్, నీలపూ రమేష్, కో–ఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, పట్టణ అధ్యక్షుడు సూర్యం, కాంగ్రెస్ నాయకులు దొడ్డ డానియల్, పెండేల హరికృష్ణ, పర్రె శ్రీనివాస్, శనిగారపు రమేష్, పందిళ్ల వెంకటేశ్వర్లు, ఉల్లంగి సతీష్, నందు ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.



## సన్న వడ్లకు రూ.500 బోనస్.... వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

- **సెప్టెంబరు 10లోగా ప్రక్రియ పూర్తి చేయాలి.... వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఆదేశాలు**



**దమ్మపేట, సెప్టెంబరు 1(ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 528, తేదీ 24-08-2026 ప్రకారం ఏడు రకాల సన్న వరి పంటలను సాగు చేస్తున్నరైతులకు ధాన్యం కొనుగోలు సమయంలో క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ అందించేందుకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అనుమతించిన సన్న వరి రకాలు బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం 1638, డబ్ల్యూజీఎల్ 44, కేఎన్ఎం 7715 సాగు చేస్తున్న రైతులు తమ పంట సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని దమ్మపేట వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. రైతులు ఈ ఏడు రకాల విత్తనాలను ఏ డీలర్ వద్ద కొనుగోలు చేశారో ఆయా డీలర్ల వద్ద తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి. సొంత విత్తనాలతో పంట సాగు చేస్తున్నరైతులు ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలో స్వీయ ధ్రువీకరణ చేయాల్సి ఉంటుంది. పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా రైతుల వివరాల నమోదు, క్షేత్రస్థాయి నిర్ధారణ, క్రాప్ బుకింగ్ ప్రక్రియ పూర్తవడంతో పాటు ధాన్యం కొనుగోలులో ప్రాధాన్యత లభించనుంది. అర్హత కలిగిన రైతులకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ అందించడం ద్వారా ఆర్థిక చేయూత లభించనుంది. వినియోగదారులకు నాణ్యమైన సన్న బియ్యం అందించడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. సన్న వరి సాగు చేస్తున్న రైతులందరూ సెప్టెంబరు 10వ తేదీలోపు పంట సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఆదేశించినట్లు అధికారులు తెలిపారు.

## ప్రభుత్వ ధాన్యంలో గోల్‌మాల్.. మిల్

- **యజమాని అరెస్ట్**
- **సీఎంఆర్ బియ్యంలో భారీ తేడా గుర్తించిన అధికారులు..**
- **ఫిర్యాదుతో పోలీసుల చర్య**



**అశ్వాపురం, సెప్టెంబర్ 1, ప్రజాజ్యోతి :** ప్రభుత్వం కేటాయించిన ధాన్యానికి సంబంధించి సీఎంఆర్ బియ్యంలో తేడాలు రావడంతో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారులు అశ్వాపురంలోని ఓ రైస్‌మిల్లులో ఇటీవల తనిఖీలు నిర్వహించారు. మిల్లులో ధాన్యం నిల్వలు, సీఎంఆర్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించిన అధికారులు పలు తేడాలను గుర్తించినట్లు సమాచారం.ప్రభుత్వానికి అందించాల్సిన సీఎంఆర్ బియ్యానికి, మిల్లులో ఉన్న నిల్వలకు మధ్య వ్యత్యాసాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు నిర్ధారణ కావడంతో అధికారులు అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యా దు చేశారు.పౌరసరఫరాల శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సంబంధిత రైస్‌మిల్ యజమానిని అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి న్యాయపరమైన చర్యలు చేపట్టారు. ప్రభుత్వ ధాన్యం విషయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.

# బంగారు తెలంగాణ కాదు - బహుజన తెలంగాణ కావాలి

- **ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు రావాలి**
- **రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో సత్తా చాటుతాం**
- **భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధార్ పార్టీ సమావేశంలో : డా.ఈడా శేషగిరిరావు**



**అశ్వారావు పేట ప్రజా జ్యోతి సెప్టెంబర్ 1**

బహుజన తెలంగాణ అంటే అన్ని కులాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందటమేనని, అగ్రవర్ణాల్లో ఉన్న పేదలు కూడా అభివృద్ధి చెందాలని ఆధార్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సుప్రీం కోర్టు న్యాయవాది డా.ఈడా శేషగిరి రావు అన్నారు. మంగళవారం అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఆధార్) పార్టీ సమావేశం అశ్వరావు పేటలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కంటే కేశవ్ గౌడ్, నియోజకవర్గ ఇన్చార్జ్ ఊకె ముత్తయ్య దొర ల అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా డా . ఈడా శేషగిరి రావు హాజరై మాట్లాడుతూ తెలంగాణ సాధించుకున్న తర్వాత ప్రజల జీవితాల్లో అనుకున్న స్థాయిలోమార్పు రాలేదని ఆయన పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ, అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యం కల్పిస్తూ బడుగు బలహీన వర్గాలను అందలం ఎక్కించాలనే ముఖ్య ఉద్దేశంతో రాజకీయ మనుగడ సాగిస్తున్న ఆధార్ పార్టీ వైపు తెలంగాణ ప్రజానికం చూస్తుందన్నారు.వెనుకబడిన వర్గాలు ఐక్యంగా ఉంటేనే హక్కుల సాధన తో పాటు మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారుయువత అన్ని రంగాల్లో రాణించాలని,సమాజ అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ సంఘటితంగా పనిచేయాలన్నారు. సమాజంలోని అన్ని వర్గాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఆయన పేర్కొన్నారు. బీసీ వర్గాలకు వారి జనాభా నిష్పత్తి కి అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గ ప్రజలకు ఆధార్ పార్టీ వెన్నంటే ఉంటుందని ఆయన తెలిపారు. 2028లో అధికారమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని, రాష్ట్రంలో మిగతా పార్టీలన్నీటికి సరైన ప్రత్యామ్నాయం ఆధార్ పార్టీ అని,ప్రజా సమస్యలపై పోరాటం చేసే ఆసక్తి కలిగిన యువతీ, యువకులకు ఆధార్ పార్టీలో అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లో ఆధార్ పార్టీ పోటీ చేసే విధంగా ప్రత్యేక కార్యచరణ రూపొందించినట్లు ఆయన తెలిపారు. ఆధార్ పార్టీ మేనిఫెస్టో ను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. త్వరలో జరగబోయే ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆధార్ పార్టీ సత్తా చూపుతోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆదార్ పార్టీ ఉపాధ్యక్షుడు అంబోజు బుడయ్య ,ఎస్టీ సెల్ చైర్మన్ అలెం వెంకటేశ్వర్లు, కొత్తగూడెం ఇంచార్జి ప్రేమ్ దయాల్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు కుక్కల నాగేశ్వరరావు గౌడ్,నాయకులు తల్లాడ వెంకన్న, శ్రీనివాస్ గౌడ్,రవి ,పోలయ్య, ఈడ అశోక్,మంగపతీ ,అక్కులయ ,సునీల్, నూక రమేష్ , వెంకట్,రహీం పాషా సుమలత, దీప్తి, కరిష్మా, షేక్ సీనా, సుభాషిణి , రాధ, అలివేలు , లక్ష్మీ,సుమతి తదితరులు పాల్గొన్నారు.

## శిరీష హత్యకు కారకుడికి కఠిన శిక్ష విధించాలి

- **న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం: వేముల నరేష్**

**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 1 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఎర్రగుంట గ్రామంలో మంగళవారం సాయంత్రం వేముల నరేష్ఆధ్వర్యంలో ఆదివాసి బిడ్డ శిరీష మృతికి సంతాపంగా జాతీయ రహదారిపై కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శిరీష చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వేముల నరేష్ మాట్లాడుతూ శిరీషను హత్య చేసిన నిందితుడికి అత్యంత కఠినమైన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి నేరాలకు పాల్పడాలంటేనే భయపడేలా శిక్ష ఉండాలని అన్నారు. శిరీష కుటుంబానికి అండగా నిలిచి, ఆమెకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.శిరీష ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యువత, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## వెయ్యి రోజుల్లోనే అభివృద్ధికి బాటలు

- **గత పదేళ్లలో చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపింది**
- **యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాసం శ్రీనాథ్**

**ఆళ్ళపల్లి, సెప్టెంబర్1(ప్రజాజ్యోతి)** గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో జరగని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజుల్లోనే చేసి చూపిస్తోందని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాసం శ్రీనాథ్ అన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు.మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వాసం శ్రీనాథ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఇప్పటికే సుమారు 90 శాతం హామీలను అమలు చేసిందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, అర్హులైన వారికి రేషన్ కార్డుల పంపిణీ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న అంతర్గత రహదారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ముఖ్యంగా మండల ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న శెట్టిపల్లి నుంచి ఆళ్ళపల్లి వరకు ప్రధాన రహదారి నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలపడం అభివృద్ధికి నిదర్శనమన్నారు.ఉన్నత విద్య పూర్తి చేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పోలీస్, అటవీ తదితర శాఖల్లో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు సరైన అవకాశాలు కల్పించలేదని విమర్శించారు.ప్రతిపక్షాలు ఇప్పటికైనా అసత్య ఆరోపణలు మానుకుని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరిస్తున్నారని, అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తే భవిష్యత్తులో ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి నులకతాటి శ్రీను, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఇనుముల ఇందుకుమార్, మర్కోడు గ్రామ శాఖ అధ్యక్షుడు కోనేటి వీరభద్రచారి, ఆత్మ కమిటీ సభ్యుడు బూర్న రవి, కాంగ్రెస్ నాయకులు ఉల్లోజు భరత్, మంద సాయిరాజ్, శ్రీరామ్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.



## వైద్య చికిత్సకు రూ.4 లక్షల ఎల్ఓసీ అందజేత



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 1 (ప్రజా జ్యోతి):** వైద్య చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సారపాక గ్రామానికి చెందిన వసంత శివ నాగేశ్వరరావుకు ప్రభుత్వం తరపున రూ.4 లక్షల విలువైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్ ) మంజూరైంది. ఈ మేరకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం మణుగూరులోని తన క్యాంపు కార్యాలయంలో నాగేశ్వరరావు సతీమణి శ్రీదేవికి ఎల్ఓసీ పత్రాన్ని అందజేశారు.ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకునే స్థోమత లేని కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి తదితర ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరికీ వైద్యం అందకుండా ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అవసరమైన వారికి ఎల్ఓసీలను మంజూరు చేస్తోందన్నారు.ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి అవసరాలకు అనుగుణంగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.వైద్య చికిత్స కోసం రూ.4 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించి అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు శ్రీదేవి, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమ కుటుంబానికి ఈ సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణను బహిష్కరిస్తాం

- మాదిగ జాతికి సంబంధం లేని కార్యక్రమంగా ప్రకటించిన నాయకులు
- స్వార్థ ప్రయోజనాల కోసం మాదిగ జాతిని ఉపయోగించుకుంటు న్నారంటూ ఆరోపణలు




**పాల్వంచ, సెప్టెంబర్ 1, ప్రజాజ్యోతి:** ఈనెల 4న పాల్వంచలో నిర్వహించనున్న మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు పాల్వంచ మండలానికి చెందిన పలువురు మాదిగ సంఘం నాయకులు ప్రకటించారు.మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మాదిగ జాతి తరపున ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కొంతమంది వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం గత కొంతకాలంగా మాదిగ జాతి పేరును ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు.విగ్రహం పేరుతో మాదిగ జాతిని వివిధ రాజకీయ వర్గాల వద్ద, అగ్రవర్ణాల వద్ద తాకట్టు పెడుతూ తమ ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నారని వారు ఆరోపించారు. అలాగే కొందరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతూ, వివిధ వ్యవహారాల్లో వివాదాలకు కారణమవుతున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు సంబంధించి సంబంధిత వ్యక్తుల వివరణ అందుబాటులో లేదు.కొత్తపల్లి సోమయ్య, దాసరి యాకయ్య తదితరులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంతో మాదిగ జాతి ఐక్యతకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొంటూ.. ఈనెల 4న జరిగే విగ్రహావిష్కరణకు మాదిగ సమాజం దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.మాదిగ జాతి ఐక్యత, ఆత్మగౌరవం కోసం భవిష్యత్తులో సామాజికంగా సమిష్టిగా పనిచేస్తామని వారు తెలిపారు. వానపాకుల రాంబాబు, కటుకూరి శేఖర్ బాబు, అల్లూరి సాంబశివరావు, పొట్టపింజర బ్రహ్మానందరావు, కొత్తపల్లి శ్రీను, మోదుగు వెంకన్న, గుండెపాక నాగరాజు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో చెరువు కట్టపై తాటి.. ఈత మొక్కలు



**దమ్మపేట, సెప్టెంబరు 1(ప్రజాజ్యోతి):** ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో దమ్మపేట గ్రామంలోని కోమల చెరువు కట్టపై మంగళవారం తాటి, ఈత, ఖర్జూరం మొక్కలను నాటారు. గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఉపాధి హామీ కూలీలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ హలవత్ బిచా నాయక్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు గీత కార్మికుల జీవనోపాధిని పెంపొందించేందుకు ప్రతి ఏటా వర్షాకాలంలో తాటి, ఈత, ఖర్జూరం మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు మాట్లాడుతూ గౌడ కుల వృత్తికి ఆధారమైన తాటి, ఈత చెట్లను పెంచడం ద్వారా భవిష్యత్తులో గీత కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. చెరువు కట్టపై చెట్ల వేళ్లు బలంగా పాతుకుపోవడం వల్ల కట్టలు కోతకు గురికాకుండా పటిష్టంగా ఉంటాయని తెలిపారు. నాటిన మొక్కలను సంరక్షించి పెద్దవిగా పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రామస్తుడు చిన్నశెట్టి యుగంధర్ అన్నారు. చెరువు కట్టపై ఉన్న పొదలు, పిచ్చిమొక్కలను తొలగించి మొక్కల పెరుగుదలకు అనుకూల వాతావరణం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి బండి అనంత్‌కుమార్, వార్డు సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కక్కిరాల రమేష్, ఆబ్కారీ, పంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు చేసి.. ఓపీఎస్ పునరుద్ధరించాలి

- పెన్షన్ భద్రతకు ప్రభుత్వం హామీ ఇవ్వాలి.
- పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా టీజీఈజేఏసీ నిరసన.





**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 1, ప్రజాజ్యోతి:** సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్)ను రద్దు చేసి ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీమ్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ టీజీఈజేఏసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం "పెన్షన్ విద్రోహ దినం" సందర్భంగా నిరసన చేపట్టారు.జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. "సీపీఎస్ రద్దు చేయాలి–ఓపీఎస్ పునరుద్ధరించాలి", "ఉద్యోగుల భవిష్యత్తుకు పెన్షన్ భద్రత కల్పించాలి" అంటూ నినాదాలు చేశారు. జిల్లా వ్యాప్తంగా మండల, డివిజన్ కేంద్రాలు, వివిధ కార్యాలయాల్లోనూ ఉద్యోగులు నిరసనల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ అమరనేని రామారావు, కన్వీనర్ సంగం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ.. పెన్షన్ ఉద్యోగికి వరం కాదని, ప్రభుత్వ సేవ అనంతరం గౌరవప్రదమైన జీవనం కోసం అవసరమైన సామాజిక భద్రత, హక్కు అని పేర్కొన్నారు. సీపీఎస్ విధానంలో ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాలు మార్కెట్ రాబడిపై ఆధారపడటం వల్ల భవిష్యత్తులో అనిశ్చితి ఏర్పడుతోందని, అందుకే సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చాలని జేఏసీ నాయకులు కోరారు. పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏల విడుదల, ఉద్యోగులకు మెరుగైన ఆరోగ్య పథకం వంటి సమస్యలను కూడా తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం నుంచి స్పందన లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు తెలిపారు. సెప్టెంబర్ 10న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ రాష్ట్ర కార్యదర్శి రాజు, జిల్లా జేఏసీ నాయకులు ఎం. వెంకటేశ్వరరావు, వెస్లీ, లాల్ మహమ్మద్, తుక్కాని శ్రీనివాసరెడ్డి, హరిలాల్, లక్ష్మణ్ నాయక్, వనమా శ్రీనివాసరావు, డి.వి. దినేష్ తదితరులతో పాటు ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

# విద్యార్థినుల కోసం మూడేళ్ల కెరీర్ రెడీనెస్ కార్యక్రమం ప్రారంభం

- ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల పాల్వంచలో కార్యక్రమానికి శ్రీకారం



**పాల్వంచ, సెప్టెంబర్ 1, ప్రజాజ్యోతి:** విద్యార్థినుల్లో చిన్ననాటి నుంచే కెరీర్‌పై అవగాహన పెంపొందించి, భవిష్యత్ అవకాశాలకు సిద్ధం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వ కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ మరియు లాంచ్ గర్ల్స్ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడేళ్ల కెరీర్ రెడీనెస్ కార్యక్రమం మంగళవారం పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో ప్రారంభమైంది.రాష్ట్రంలోని 43 ప్రభుత్వ డిగ్రీ, అటానమస్ కళాశాలల్లో అమలు చేయనున్న ఈ కార్యక్రమాన్ని 2026–27 విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరం విద్యార్థినులతో ప్రారంభిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆర్థిక అవగాహన, డిజిటల్ లిటరసీ, వ్యక్తిత్వ వికాసం, వృత్తిపరమైన నైపుణ్యాలు తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించనున్నారు.ఈ శిక్షణ ద్వారా విద్యార్థినులు ఉన్నత విద్య, ఉద్యోగాలు, స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు అవసరమైన ప్రాయోగిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునే అవకాశం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమాన్ని లాంచ్ గర్ల్స్ ప్రోగ్రామ్ అసోసియేట్ ప్రియాంక నిర్వహించగా, కళాశాల మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త డా. జె. మాధవి సమన్వయం చేశారు.కెరీర్ రెడీనెస్ కార్యక్రమ ఫ్యాకల్టీ సభ్యులు డా. ఎన్. శ్రీదేవి, శ్రీమతి ఎస్. విమల, శ్రీమతి ఎ. హారిక, శ్రీమతి కరీమా తబస్సుమ్ కార్యక్రమ నిర్వహణలో సహకరించారు.

# పేదల సొంతింటి కల సాకారం



**ములకలపల్లి, సెప్టెంబరు 01(ప్రజాజ్యోతి):** రాజుపేటలో మేకల సరితకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.కాంగ్రెస్ జిల్లా నాయకుడు బత్తుల అంజి, మండల అధ్యక్షుడు ఎం.డి. జహీరుద్దీన్, సర్పంచ్ చంద్రలేఖ ఇంటిని ప్రారంభించి లబ్ధిదారులను అభినందించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని నాయకులు తెలిపారు. రెండో విడతలో గుడిసెలేని గ్రామాలే ధ్యేయంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాండ్ర ప్రభాకర్, సురభి రాజేష్, పాలకుర్తి సుమిత్, శేషామఠం వెంకటేశ్వరరావు, ముదిగొండ శివ, కటికనేని ఆదిత్య, బండారు కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# నవోదయ ప్రవేశానికి జిల్లా స్థాయి మెగా మోడల్ పరీక్ష

- సెప్టెంబర్ 6న బ్రిలియంట్ విద్యాసంస్థలో నిర్వహణ



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 1 (ప్రజా జ్యోతి):** జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష 2027–28కు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు నూతన సిలబస్ ఆధారంగా జిల్లా స్థాయి మెగా మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు సారపాక బ్రిలియంట్ నవోదయ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ డా. బి.ఎన్.ఆర్. తెలిపారు. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నవోదయ ప్రవేశ పరీక్షపై అవగాహన కల్పించడంతో పాటు, వారి ప్రతిభను అంచనా వేసేందుకు ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.సెప్టెంబర్ 6న ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సారపాకలోని బ్రిలియంట్ విద్యాసంస్థలో మెగా మోడల్ పరీక్ష జరుగుతుందని తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు ఈ పరీక్షకు హాజరై తమ ప్రతిభను పరీక్షించుకోవచ్చన్నారు. నవోదయ ప్రవేశ పరీక్ష తరహాలోనే ఓఎంఆర్ విధానంలో మొత్తం 100 మార్కులకు పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు.పరీక్షలో మెంటల్ ఎబిలిటీ, ఎన్విరాన్‌మెంట్, గణితం, లాంగ్వేజ్ టెస్ట్ విభాగాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒక్కో విభాగానికి 20 మార్కుల చొప్పున మార్కులు కేటాయించినట్లు చెప్పారు. నూతన సిలబస్‌కు అనుగుణంగా పరీక్షను రూపొందించడం వల్ల విద్యార్థులకు అసలు ప్రవేశ పరీక్షలో ప్రశ్నల సరళి, సమయపాలన, ఓఎంఆర్ విధానం తదితర అంశాలపై ముందస్తు అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు.ఈ మెగా మోడల్ పరీక్షలో ప్రతిభ కనబరిచి మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఉచిత నవోదయ కోచింగ్ అందించనున్నట్లు డా. బి.ఎన్.ఆర్. తెలిపారు. దీంతో ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ పొందేందుకు మంచి అవకాశం లభిస్తుందని అన్నారు.పరీక్షకు హాజరు కావాలనుకునే విద్యార్థులు సెప్టెంబర్ 5లోపు బ్రిలియంట్ నవోదయ కోచింగ్ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నవోదయ ప్రవేశ పరీక్షకు ఇప్పటి నుంచే సమర్థవంతంగా సిద్ధం కావాలని కోరారు.పరీక్షకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 9866283566, 9705137128 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

## నేరాల నియంత్రణకు నిఘా నేత్రం

- దమ్మపేటలో సీసీ కెమెరాల ఏర్పాటు
- సీ.సీ కెమెరాలతో నేరాల నియంత్రణ ... సీ.ఐ నాగరాజు
- ప్రజలకు మెరుగైన భద్రత ..ఎస్ఐ రాజేష్



**దమ్మపేట, సెప్టెంబరు 1(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండల కేంద్రంలో ఇక ప్రతి కదలికపై నిఘా ఉండనుంది. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మరింత భద్రత కల్పించే లక్ష్యంతో ప్రధాన కూడళ్లు, రహదారుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. సీఐ నాగరాజు, ఎస్ఐ రాజేష్ సూచనల మేరకు సీసీ కెమెరాల ఏర్పాటుకు పంచాయతీ నిధులు సమకూర్చాలని సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబును కోరగా ఆమె సానుకూలంగా స్పందించారు. ఇందులో భాగంగా మంగళవారం జరుగుతున్న కెమెరాల ఏర్పాటు పనులను పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాత్రి వేళల్లోనూ స్పష్టమైన దృశ్యాలు నమోదయ్యేలా నైట్ విజన్, అధునాతన కెమెరాలను ఏర్పాటు చేయాలని టెక్నీషియన్ శ్రీరాముల శరత్‌కు సూచించారు. ప్రధాన కూడళ్లు, రహదారుల ప్రారంభం, ముగింపు ప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా నిఘా వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని అధికారులు తెలిపారు. ఏర్పాటు చేసిన కెమెరాలను దొంగలు, ఆకతాయిలు ధ్వంసం చేయకుండా ప్రజలు సంరక్షించాలని కోరారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, దాతలు ముందుకు రావాలని సూచించారు. వ్యాపారులు తమ దుకాణాల వద్ద కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాల నియంత్రణకు సహకరించాలని అవగాహన కల్పించారు. సీసీ కెమెరాల నిఘాతో నేరగాళ్లలో భయం ఏర్పడి దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు తగ్గుతాయని, ఏదైనా అవాంఛనీయ ఘటన లేదా రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు కెమెరా ఫుటేజ్ కీలక ఆధారంగా ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, కార్యదర్శి బండి అనంత్‌కుమార్, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్‌గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, బత్తుల సాయి, గ్రామస్తులు అత్తిలి శ్రీనివాసరావు, చిన్నశెట్టి ముక్తేశ్వరరావు, గవర రాంబాబు, సున్నం శ్రీనివాసరావు, సంకు రమేష్, ముక్కు శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్ సమావేశం

**చర్ల, సెప్టెంబర్ 01:(ప్రజాజ్యోతి):** చర్ల మండల కేంద్రంలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో మంగళవారం విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) చర్ల ప్రఖండ సమావేశం మంగళవారం నిర్వహించారు. ప్రఖండ అధ్యక్షులు మామిడి శ్యామ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గత నెలలో నిర్వహించిన కార్యక్రమాలపై జిల్లా సంఘటన కార్యదర్శి గంగాధరి సీత సమీక్ష నిర్వహించారు.అనంతరం ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సెప్టెంబర్ 1 నుంచి 10వ తేదీ వరకు చర్ల ప్రఖండ పరిధిలోని గ్రామాల్లో విశ్వహిందూ పరిషత్ స్థాపన దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. పరిషత్ 61 ఏళ్లుగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు, గోరక్షణ, ఆలయాల పరిరక్షణ, మత మార్పిడుల నివారణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.అలాగే గణేష్ ఉత్సవాలను భక్తి భావంతో, మత్తు పదార్థాలు, అశ్లీలతకు తావులేకుండా నిర్వహించాలని సూచించారు. సెప్టెంబర్ 20 నుంచి 30వ తేదీ వరకు సత్సంగ దర్శన్ కార్యక్రమంలో భాగంగా నూతన గ్రామ కమిటీలు, సత్సంగాలను ఏర్పాటు చేసి గ్రామాల్లోని ప్రజలను ధార్మిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో వీహెచ్ పీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు చిలుకూరి నాగేశ్వరరావు, ప్రఖండ కార్యదర్శి కిషోర్ కుమార్, ఉపాధ్యక్షులు ఇరసవడ్ల రాము, సహ కార్యదర్శులు అలవాల మురళీ, చెరుకూరి శ్రీకర్, బజరంగ్ దళ్ సహ సంయోజక్ గాధంశెట్టి ప్రదీప్‌తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



# శిరీష కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం: మంత్రి సీతక్క

- బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు
- రూ.5 లక్షల సాయం.. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం
- వ్యవసాయ భూమి కేటాయింపునకు హామీ





**ములకలపల్లి, సెప్టెంబరు 1 (ప్రజాజ్యోతి):** ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఊకే శిరీష అనుమానాస్పద మృతి ఘటనపై మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం చౌటిగూడెం చేరుకున్న మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి శిరీష కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రూ.5 లక్షల తక్షణ ఆర్థిక సాయం, కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఐటీడీఏ ద్వారా అవసరమైన సహాయం అందించడంతో పాటు కుటుంబ జీవనోపాధికి వ్యవసాయ ప్రభుత్వ భూమి కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శిరీష మృతి ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**కుటుంబానికి అండగా ఉంటాం: ఎమ్మెల్యే జారే**

శిరీష కుటుంబానికి వ్యక్తిగతంగా, ప్రభుత్వపరంగా, పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. కుటుంబానికి న్యాయం జరిగేలా సహకరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కుంజా రవి, కుంజా వినోద్, జిల్లా నాయకులు బత్తుల అంజి, ఎండీ జహీరుద్దీన్, కారం సుదీర్, పాలకుర్తి రవి, పాలకుర్తి సుమిత్ మండల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జీవో-3 స్థానంలో ఏజెన్సీకి ప్రత్యేక జీవో తీసుకురావాలి

- గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి
- సింగరేణిలో స్థానిక గిరిజనులకు 80 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి
- సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడ్య ప్రసాద్ నాయక్




**పాల్వంచ, సెప్టెంబర్ 1, ప్రజాజ్యోతి:** ఏజెన్సీ ప్రాంతాల్లో అమలవుతున్న జీవో–3 స్థానంలో గిరిజనుల ప్రయోజనాలను కాపాడేలా కొత్త జీవోను తీసుకురావాలని సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడ్య ప్రసాద్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం పాల్వంచ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన నిరుద్యోగ విద్యార్థులకు తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో జీవో–3కు ప్రత్యామ్నాయంగా మరో జీవో తీసుకువస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు.ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడంలో ఐటీడీఏ పీవో నిర్లక్ష్య వైఖరి కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. గిరిజనుల భూములకు రక్షణ కల్పించేందుకు చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా సింగరేణి సంస్థలో స్థానిక గిరిజనులకు 80 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రసాద్ నాయక్ కోరారు. గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం సమగ్ర విధానాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో సేవాలాల్ బంజారా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరీష్ నాయక్, నరేష్ నాయక్, అనిల్ నాయక్, సతీష్, చంటి నాయక్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 2న బీఆర్ఎస్ నిరసనకు తరలిరావాలి

**ములకలపల్లి సెప్టెంబర్ 1 (ప్రజాజ్యోతి):** అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో సెప్టెంబర్ 2న నిర్వహించనున్న బీఆర్ఎస్ నిరసన కార్యక్రమానికి మండలంలోని 20 గ్రామపంచాయతీల నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు తరలిరావాలని మాజీ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు పిలుపునిచ్చారు. మంగళవారం ములకలపల్లి రాయల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు, సభ్యత్వ నమోదు కార్యక్రమాల ఇన్‌చార్జి ఉప్పల వెంకటరమణ, నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు ఆదేశాల మేరకు నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఈ సమావేశంలో సర్పంచులు తుర్రం శ్రీను, భూక్యా ధర్మ, తానం పద్మతో పాటు నాయకులు తాండ్ర రాంబాబు, బండి కొమరయ్య, మట్ల నాగమణి, పుష్పాల చందర్‌రావు, ఇనగంటి రాము, సూరం పుల్లారావు, పుష్పాల హనుమంతు, వేముల సతీష్, మిర్యాల మధు, కొండవీటి రాజారావు, సున్నం బాబురావు, దేవభక్తుని చిట్టీబాబు, యలమంచిలి సునీల్, గంగవరపు సుధాకర్, గడ్డం ఉదయ్, పూరేటి నర్సింహారావు, కొండవీటి చంద్రశేఖర్, బొర్రా సుధాకర్, తాటి రవి, ఊకె అశోక్, భూక్యా నంద, పుష్పాల గోపి, సడియం అశోక్, బొంతు నందు, పుష్పాల సాయి, తానం భాస్కర్, మెచ్చా నాగేశ్వరావు, కొట్టె శేషగిరి, రింగు బాలకృష్ణ, జైభీమ్ నర్సింహా, బైటి రాము, సోడే కేశవరావు, గండూరి ప్రమోద్, ఆదిమూలం శేషగిరి, వనమా ప్రకాష్, మీడియం మహేష్, బొర్రా రవి, బజ్జూరి కృష్ణ, బజ్జూరి రాము, ఊరపెద్ది వెంకన్న, సాయిన్ని సుబ్బారావు, ఇర్పా ప్రసాద్, కుంజా వెంకటేష్, తాటి రాఘవులు, తెల్లం నర్సింహారావు, కొండ్రు వంశీ వినయ్, చీటిక లక్ష్మికుమారి, లింగాల రాధ, వాడే నాసరయ్య, కొండ్రు శ్రీరాములు, కాకటి భాస్కరరావు, సున్నం రాజు తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలం ఏజెన్సీ రాజకీయాల్లో ఎన్నడూ లేని విధంగా ఒక పెద్ద ఆర్థిక కుంభకోణం కలకలం రేపుతోంది. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాజీ పీఏ కొర్ల కళ్యాణ్ కుమార్ చేసిన లీలలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుంటే.. ఈ దందా పరిమాణం చూసి మన్యం వాసులు ముక్కున వేలేసుకుంటున్నారు.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి



# 'తెల్లం' నీడలో... ఆర్థిక కుంభకోణం

● భద్రాద్రి మన్యంలో పొలిటికల్ క్రైమ్ ● ఎమ్మెల్యే నీడలో రూ. కోట్ల దందా! ● పీఏ మోసాల వెనుక అసలు 'వాటాదారు' ఎవరు..? ● ఆ లక్షల నగదు ఎవరి ఖాతాల్లోకి వెళ్లింది..? ● కళ్యాణ్ కుమార్‌పై కేసుతో సరిపోతుందా..? ● అసలు వేట మొదలయ్యేది ఎప్పుడు..? ● బయటపడ్డ మరో 'తెల్లం' బండారం.. ● కాపాడేందుకు చూస్తున్న ఓ మంత్రి..?

ఉద్యోగాలు, బదిలీలు, ఇసుక రీచ్‌లు.. ఇలా దేన్నీ వదలకుండా రూ. కోట్లలో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఇప్పుడు అందరి నోటా నానుతున్న ప్రధాన ప్రశ్న ఒక్కటే.. "ఈ అక్రమ సంపాదనలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు వాటా ఎంత..?" ఇది పక్కా 'తెల్లం' నీడలో సాగిన అతి పెద్ద ఆర్థిక 'కుంభకోణ'మేన అని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ›› 'వెంకట్రావు' పేరు 'హామీ' తోనే..

భద్రాచలం ఎమ్మెల్యే పేరిట ఉన్న పవర్‌ను వాడుకుంటూ పీఏ కళ్యాణ్ కుమార్ భద్రాద్రి మన్యంలో ఒక అతి పెద్ద రాకెట్‌నే నడిపాడు. ఉద్యోగాల పేరుతో 'కోట్ల' రూపాయిల మోసానికి తెగబడ్డాడు. ఒక్కో నిరుద్యోగికి కొలువుల ఎర చూపిస్తూ అమాయక గిరిజనులను మోసానికి పాల్పడ్డాడు. జెన్కో, ఐటీసీ, సింగరేణి, గురుకుల పాఠశాలల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి ఒక్కో నిరుద్యోగి వద్ద నుంచి రూ. 10 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు దండుకున్నట్లు ఆధారాలు బయటపడుతున్నాయి. ఇందులో బాధితులకు అనుమానం రాకుండా ఉండేందుకు ఏకంగా నకిలీ నియామక పత్రాలను సృష్టించి ఇచ్చారంటే ఈ వ్యవహారం ఎంత తీవ్రమైనదో అర్థం చేసుకోవచ్చు. ఉద్యోగాలే కాకుండా ప్రభుత్వ అధికారుల పోస్టింగ్‌లు, గోదావరి ఇసుక ర్యాంపుల అనుమతుల పేరిట కాంట్రాక్టర్లు, అధికారుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు బాధితులు, బంజారా జేఏసీ నాయకులు ఆరోపిస్తున్నారు.

### ›› ఎమ్మెల్యే ప్రమేయం లేదనడం సాధ్యమేనా..?

ఎమ్మెల్యే పి ఎ పై ఇప్పుడే కాదు గత 7 నెలల క్రితమే ఈ ఆరోపణ బయటకు వచ్చింది. అయిన ఇప్పుడు "నాకు ఏమీ తెలియదు, నా పేరు వాడుకున్నాడు" అంటూ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఈ వ్యవహారం నుంచి తప్పుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ.. ప్రజల్లో మాత్రం అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనుక్షణం తన పక్కనే ఉంటూ, క్యాంప్ ఆఫీస్ కేంద్రంగా రూ. కోట్ల లావాదేవీలు నడుపుతుంటే ప్రజాప్రతినిధికి తెలియకపోవడం నమ్మశక్యంగా ఉందా? ఎమ్మెల్యే సిఫార్సు లేఖలు, ఆయన పేరు ఆధారంగానే ఈ స్థాయిలో డబ్బులు వసూలయ్యాయనేది స్పష్టమవుతోంది. దీంతో పీఏ వెనుక ఉండి నడిపించిన అసలు హస్తం ఎవరిది? అందులో తెల్లం వెంకట్రావుకు చేరిన వాటా ఎంత అనే కోణాన్ని బలంగా విచారించాల్సి ఉందనే డిమాండ్ పెరుగుతోంది.

### ›› నిగ్గు తేల్చేందుకు !

ఈ వ్యవహారంలో ప్రధాన సూత్రధారులు బయటకు రావాలంటే పీఏను అరెస్ట్ చేయడం లేదా ఉద్యోగం నుంచి తీసివేయడం మాత్రమే సరిపోదని, దీనికోసం పీఏ కళ్యాణ్ కుమార్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు, బినామీల బ్యాంకు ఖాతాలను సమగ్రంగా తనిఖీ చేస్తూ లోతైన మనీ ట్రయల్ విచారణ జరపాలని డిమాండ్ వినపిస్తుంది. అలాగే నిరుద్యోగుల నుంచి వసూలు చేసిన రూ. కోట్లు ఏ ఏ నాయకుల, ప్రజాప్రతినిధుల చేతుల్లోకి వెళ్లాయో సమగ్రంగా, పారదర్శకంగా నిగ్గు తేల్చాలని నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఈ కుంభకోణంతో తనకు సంబంధం లేదని ఎమ్మెల్యే చెబుతున్నప్పటికీ, కేవలం పీఏపై గూబ గుయ్‌మనిపించి చేతులు దులుపుకుంటే సరిపోదు. "తెల్లం వెంకట్రావు వాటా ఎంత?" అనే ప్రశ్న రాజకీయ విమర్శగా మిగిలిపోకుండా.. పీఏ వెనుక ఉన్న పెద్దలను చట్టం ముందు నిలబెట్టి, బాధితులకు న్యాయం జరిగే వరకు నిష్పాక్షిక దర్యాప్తు జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే ఈ అంశం పై ఓ మంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ అతని అనుచరుడుగా పేరొందిన ఈ నేతను కాపాడే ప్రయత్నం చేస్తున్నాడని సమాచారం.

## మరో 'తెల్లం' బండారం..

ఇక ఈ ఉద్యోగాల వసూళ్ల దందా ఎంతటి తీవ్రరూపం దాల్చిందో చెప్పడానికి దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్‌లో నమోదైన తాజాగా బయటపడిన ఈ లిఖితపూర్వక ఫిర్యాదే ప్రత్యక్ష నిదర్శనం. దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరం గ్రామానికి చెందిన గిరిజన మహిళ తాటి రత్నం తన కుమారుడికి భద్రాద్రి పవర్ ప్లాంట్ మణుగూరులో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి, దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తెల్లం హరికృష్ణ రూ.15 లక్షలు దండుకున్నాడని పోలీసులను ఆశ్రయించింది. హరికృష్ణ సూచించిన కొర్ల రాధ అకౌంట్‌కు (ఎస్ బి ఐ భద్రాచలం) రూ.14.50 లక్షలు, హరికృష్ణ సొంత అకౌంట్‌కు రూ.50 వేలు బదిలీ చేసినట్లు బ్యాంక్ రశీదులు, వాట్సాప్ స్క్రీన్‌షాట్‌లను ఆధారాలుగా సమర్పించారు. డబ్బులు తీసుకున్నాక నకిలీ ప్రొసీడింగ్ లేఖల పేరుతో రోజులు దాటవేస్తూ నిరుపేద కుటుంబానికి అన్యాయం చేస్తుండటంతో, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు మండల స్థాయి పార్టీ నాయకుల హస్తం లేకుండా ఇంత పెద్ద మొత్తంలో అధికారిక బ్యాంకు ఖాతాల ద్వారానే అక్రమ లావాదేవీలు సాగడం సాధ్యమేనా అనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.